

జంగేడులో కూల్చివేసిన బీఆర్ఎస్ పార్టీ జెండా గద్దెను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

## జెండా గద్దెలను కూల్చే చిల్లర రాజకీయాలు మానుకోవాలి

- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణ కాలనీ, ఏప్రిల్ 16 : బీఆర్ఎస్ పార్టీ జెండా గద్దెలను కూల్చివేసిన వారు చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు జంగేడులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఎదుట నూతనంగా ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ పార్టీ జెండా గద్దెను కొంతమంది దుండగులు మంగళవారం అర్ధరాత్రి కూల్చివేయడంతో, విషయం తెలుసుకున్న గండ్ర అక్కడికి చేరుకొని పరిశీలించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ప్రతిపక్ష పార్టీల జెండా గద్దెలను కూల్చివేయడం వారి అహంకారానికి నిదర్శనమన్నారు. అర్ధరాత్రి సమయంలో సీసీ కెమెరాలను ఆపివేసి బీఆర్ఎస్ పార్టీ జెండా గద్దెను కూల్చి వేశారంటే, బీఆర్ఎస్ పార్టీ అంటే కూల్చివేసిన వారిలో భయం పట్టుకుందన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రచారం చేసుకునే హక్కును ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం కల్పించిందని, దాన్ని కాలరాసే హక్కు ఎవరికీ లేదన్నారు. తమ పార్టీ గద్దెను కూల్చి శునకానందం పొందే వారికి ఇదే చివరి హెచ్చరికని మండిపడ్డారు. 14వ వార్డు జంగేడు సెంటర్‌లో నిలబడి ధైర్యంగా బీఆర్ఎస్ పాలనలో తాము జంగేడును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినామని సగర్వంగా చెప్పుకునే దమ్ము ధైర్యం ఉందని, కానీ మీరు అధికారంలోకి వచ్చి 15నెలలు పూర్తవుతున్నప్పటికీ అభివృద్ధి ఏమిటో జంగేడులో నిలబడి చెప్పే ధైర్యం ఉందా అని నిలదీశారు. తమ పార్టీ గద్దెలను కూల్చివేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, తప్పక తిరిగి ఇస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్ యాదవ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బుర్ర రమేశ్, మాజీ కౌన్సిలర్ దార పూలమ్మ, కో ఆప్షన్ మాజీ సభ్యుడు దొంగల ఐలయ్య, వార్డు అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు దొంగల శంకర్, గోగు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలో పాల్గొన్న భక్తులు

ఏటూరునాగారం, ఏప్రిల్ 16 : మండల కేంద్రంలో బుధవారం అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యా ఉపాసకులు, సంఖ్యా శాస్త్ర పండితులు బ్రహ్మ శ్రీ మల్లావజ్జల రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో గణపాటి గణేశ్‌శర్మ, పదిమంది వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ ఉదయం11.08 గంటలకు యంత్ర ప్రతిష్ఠ చేపట్టారు. ఆలయ సన్నిధిలో గణపతి, సుబ్రమణ్యేశ్వరస్వామి, శివలింగం, మాలికపు రత్తమ్మ, విష్ణుమూర్తి, ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠ ఏకకాలంలో చేపట్టారు. పంచ లోహాలతో తయారు చేసిన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. రాత్రి మెట్ల పూజ, పడి పూజ పంచామృత అభిషేకాలు చేపట్టారు. మహా అన్న ప్రసాద కార్యక్రమాన్ని చేపట్టారు. వేడుకల్లో స్థానిక ఏఎస్పీ శివం ఉపాధ్యాయ దంపతులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు ధనసరి సూర్య, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ బొలసాని గౌరీశంకర్, వైస్‌చైర్మన్ అల్లి శ్రీనివాస్, కార్యదర్శి బోడ సత్యం, పాలకుర్తి పాపారావు, విగ్రహ దాతలు యాదిరెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్, మెట్ల దాతలు, కలశ దాతలు, రామాలయం, సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్లు అలువాల శ్రీనివాస్, పెండ్యాల ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు.

## స్తంభంపల్లి అడవిలో పులి పాదముద్రలు

మహాముత్తారం, ఏప్రిల్ 16 : స్తంభంపల్లి (పీకే )గ్రామ అటవీ సమీపంలో పులి పాదముద్రలు కనిపించాయని గ్రామస్తులు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. దీనిపై దూదేకులపల్లి ఎఫ్ఆర్వో రామ్మూర్తిని వివరణ కోరగా వారం క్రితం ఈ ప్రాంతానికి పెద్దపులి వచ్చిందని, ఆ తర్వాత బ్యాగ్‌పేట శివారులోకి వెళ్లినట్లు తెలిపారు.

# చెడగొట్టు వాన

- అకాల వర్షంతో రైతు ఆగం
- మక్క, అరటి, వరికి తీరని నష్టం
- ఆందోళనలో అన్నదాత
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



టేకుమట్ల : అరటి తోటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

టేకుమట్ల, ఏప్రిల్ 16 : మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి గాలి దుమారం, ఉరుములతో కూడిన వర్షం పడ్డది. అరటి చెట్లు, మక్కజొన్న నేలకొరగగా, కోతదశలో ఉన్న వడ్లు నేలరాలాయి. వ్యవసాయ అధికారులు ఏవో కల్యాణి, హార్టికల్చర్ అధికారి సునీల్, ఏఈవోలు రాహుల్, అరుణ్, భరత్, అభినయ్‌లో బుధవారం ఉదయం నష్టం జరిగిన పంటలను సందర్శించి, వరి 210 ఎకరాల్లో, మక్కజొన్న 92ఎకరాల్లో, అరటి తోట 74ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. రోడ్లపై చెట్లు విరిగిపడి తెగిపోగా, గుడిసెలపై కప్పుల కవర్లు, ఇండ్లపై వేసిన రేకులు గాలి తీవ్రతకు కొట్టుకుపోయాయి. మండల కేంద్రానికి చెందిన తూర్పాటి ఆనందం ఇంటి పై కప్పు గాలికి కొట్టుకుపోవడంతో వర్షపు నీటికి ఇంట్లోని వస్తువులు తడిసిపోయాయి. టేకుమట్ల కార్యదర్శి సాంబశివుడు ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులతో కలిసి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. నివేదిక తయారు చేసి తక్షణ సాయం అందేలా చూస్తామన్నారు.

### అకాల వర్షంతో.. అపార నష్టం

చిట్యాల : మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. కల్లాల్లో ఆరబోసిన మిరప రాశులు తడిసిముద్దయ్యాయి. అరటి తోటలు గాలి వానకు పూర్తిగా నేలకొరిగాయి. రామచంద్రపురం గ్రామంలో సుమారు 30ఎకరాల అరటి తోట నేలకొరిగింది. సూర సుధాకర్, గాజే అశోక్, క్యాతం భద్రయ్య, క్యాతం రమేశ్, మధుకర్, సతీశ్, లింగ్యాలకు చెందిన అరటి తోటలు పూర్తిగా దెబ్బతినడంతో బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిద్దముత్తారం, నవాబుపేట, చైన్‌పాక, జూకల్, చిట్యాల శివారులోని వరి పంట పొలాలు రాళ్ల వర్షానికి గింజలు రాలి నేలవాలాయి. హార్టికల్చర్ డివిజనల్ అధికారి సునీల్, ఏవో శ్రీనివాస్‌రెడ్డి నష్టపోయిన పంటలను సందర్శించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు. చింతకుంట రామయ్యపల్లిలో పర్లపల్లి కొమురయ్య ఇంటి రేకుల కప్పు గాలికి ఎగిరిపడ్డది. చింతకుంటరామయ్యపల్లి, చిట్యాలలో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. రోడ్లకు అడ్డంకులుగా చెట్లు విరిగిపడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

### అకాల వర్షానికి అపార పంట నష్టం..

రేగొండ : మంగళవారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి రేగొండ, గోరికొత్తపల్లి మండలాల్లో అపార నష్టం వాటిల్లింది. రేగొండ మండల కేంద్రంతోపాటు భాగిర్తిపేట, లింగాల, మండుతపల్లి, రేపాక, గోరికొత్తపల్లి, చిన్న కోడెపాక దామరంచపల్లె, బాలయ్యపల్లె, జగ్గయ్యపేట, వెంకటేశ్వర్లపల్లి, నిజాంపల్లె గ్రామాల్లో మక్కజొన్న, వరి, అరటి తోటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ అధికారులు బుధవారం దెబ్బతిన్న పంటలను పరిశీలించి నివేదికను జిల్లా అధికారులకు అందజేశారు. రేగొండ మండలంలో వరి 555ఎకరాలు, మక్కజొన్న 420 ఎకరాలు, గోరికొత్తపల్లి మండలంలో 325ఎకరాల వరి, 498 ఎకరాల్లో మక్కజొన్న పంట, 50ఎకరాల్లో అరటితోటలు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు.

### మొగుళ్లపల్లి మండలంలో వడగండ్ల వాన..

మొగుళ్లపల్లి : మండలంలో మంగళవారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. పొలంలోని వరి కంకులు నేలరాలాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

### భూపాలపల్లి జిల్లాలో 17.5 మి.మీ వర్షపాతం

భూపాలపల్లి రూరల్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బుధవారం ఉదయం 8వరకు 17.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు జిల్లా వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జిల్లా పరిధిలోని పలిమెల మండలంలో 17.2 మి.మీ, మల్హర్‌రావులో 10.4మి.మీ, చిట్యాలలో 46.8మి.మీ, టేకుమట్లలో 30.6మి.మీ, మొగుళ్లపల్లిలో 39.4 మి.మీ, రేగొండలో 29మి.మీ, గణపురంలో 6.4మి.మీ, భూపాలపల్లి మండలంలో 13.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వారు తెలిపారు.

### పిడుగుపాటుతో రెండు దుక్కిటెద్దులు మృతి..

భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామంలో మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గ్రామంలోని ప్రభాకర్ తన ఇంటి ముందు రెండు దుక్కిటెద్దులను కట్టేశాడు. పిడుగు పడడంతో అక్కడికక్కడే ఎద్దులు మృతి చెందాయని ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. వాటి విలువ రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన కోరారు.



చిట్యాల : రామచంద్రపురంలో అరటి తోటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి సునీల్



రేగొండ : లింగాలలో నేలవాలిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



చిట్యాల : నవాబుపేట శివారులో నేలకొరిగిన మక్కజొన్న పంటను చూపుతున్న రైతు

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం : సీడీపీవో ముత్తమ్మ

వాజేడు, ఏప్రిల్ 16 : గర్భిణులు, బాలింతలు పౌష్టిక ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని వెంకటాపురం ఐసీడీఎస్ సీడీపీవో ముత్తమ్మ సూచించారు. మండలంలోని మొరుమూరు గ్రామపంచాయతీలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలను కలిపి బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సూపర్‌వైజర్లు చంద్రకళ, అంజమ్మ, బీసీకోఆర్డినేటర్ విజేందర్, అంగన్‌వాడీ టీచర్లు దేవకుమారి, రమాదేవి, కఫెడ్ ఎంజీవోస్ కామేశ్, రమాదేవి పాల్గొన్నారు.

## గ్రామ కార్యదర్శులకు షోకాజు నోటీసులు జారీ

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 16 : విధులపై నిర్లక్ష్యం వహిస్తున్న గ్రామ కార్యదర్శులకు ఎంపీవో హనుమంతరావు బుధవారం షోకాజు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 11వ తేదీన అకాల వర్షాల కారణంగా మండల ప్రత్యేక అధికారి అప్పల నాయకుడు సందర్శిస్తున్నారని 10వ తేదీన ముందస్తు సమాచారం అందించారు. అయినప్పటికీ మండలంలోని ఉప్పేడు వీరాపురం, పాత్రాపురం, వీరభద్రాపురం, రామచంద్రాపురం, మొర్రివానిగూడెం గ్రామ కార్యదర్శులు విధులకు గైర్హాజరయ్యాని తెలిపారు. మూడు రోజుల్లో షోకాజు నోటీసుకు సమాధానం ఇవ్వాలని ఆదేశించారు.

## దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు

ములుగురూరల్, ఏప్రిల్ 16 : ములుగు మండలం దేవనగర్ గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ప్రేమ వివాహం విషయంలో గొడ్డలితో దాడి చేసిన విషయం తెలిసిందే. మద్దెవేని ప్రసాద్, మద్దెవేని సతీశ్‌లు ముక్కాముల సమ్మయ్యతోపాటు అతని కొడుకు సురేశ్‌యాదవ్‌పై మంగళవారం గొడ్డలితో దాడి చేశారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ప్రసాద్, సతీశ్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

## రవినగర్ శివారులో 11కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురిపై కేసు నమోదు
- డీఎస్పీ సంపత్‌రావు వెల్లడి

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 16 : గణపురం మండలం రవినగర్ శివారులోని మంగలోని కుంట మత్తడి వద్ద 11కిలోల 210 గ్రాముల గంజాయిని పట్టుకొని, ముగ్గురు నిందుతులపై కేసు నమోదు చేసినట్లు భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. భూపాలపల్లి సబ్‌డివిజన్ పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సంపత్ రావు కేసుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు గణపురం ఎస్సై అశోక్ తన సిబ్బందితో కలిసి రవినగర్ గ్రామ శివారులోని మంగలోని కుంట మత్తడి వద్ద మాటు వేసి తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీలో గుర్రంపేటకు చెందిన ఆరెల్లి అఖిల్, చెల్పూర్‌కు చెందిన ఆముదాల కార్తీక్, వరంగల్ జిల్లా వరికోల్‌కు చెందిన ముస్కే రోహిత్‌ల వద్ద రూ.5,60,500 విలువ గల 11కిలోల210 గ్రాముల ఎండు గంజాయి ఒక సంచిలో పట్టుకొని ఉండగా, వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేశామన్నారు. ఒరిస్సా రాష్ట్రంలోని కొండ ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర తక్కువ ధరకు తెచ్చి భూపాలపల్లి, గణపురం మండల పరిసర ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్నట్లు తెలిపారు. గంజాయి పట్టుకోవడంలో ఉత్తమ విధులు నిర్వహించిన చిట్యాల సీఐ మల్లేశ్, సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు, గణపురం (ము) ఎస్సై అశోక్, సీసీఎస్ ఎస్సై భాస్కర్‌రావు, పీసీలు జే శ్రీనివాస్, ఏ అశోక్, పీ క్రాంతి, పీ నేతాజీలను భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు అభినందించారు.

## భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 16 : మండలంలోని పిడిసిల్ల గ్రామానికి చెందిన గైకాడి రవీందర్‌రావు అదృశ్యమైనట్లు ఎస్సై అశోక్ బుధవారం తెలిపారు. ఈ నెల 14న తెలిసిన వ్యక్తి తన బంధువుల దగ్గర అప్పు ఇప్పిస్తానని చెప్పగా ఇంట్లో నుంచి వెళ్లి మండల కేంద్రంలోని తన అక్క ఇంట్లో మోటార్ సైకిల్ పెట్టి వెళ్లిపోయాడు. నాటి నుంచి నేటి వరకు తిరిగి ఇంటికి రాలేదని, బంధుల ఇళ్లలో, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లేకపోవడంతో భార్య గైకాడి శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## 'కార్మిక సంక్షేమ బోర్డును ఎత్తివేసే కుట్రలను విరమించుకోవాలి'

ములుగురూరల్, ఏప్రిల్ 16 : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ఎత్తివేసే కుట్రలను విరమించుకోవాలని, సహజ, ప్రమాద మరణాలకు ఒకే రకమైన పరిహారాలు అందించాలని ఏఐటీయూసీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ద్వితీయ మహా సభ కొండయ్య అధ్యక్షతన జరుగగా ఆయన పాల్గొని మాట్లాడారు. అనేక పోరాటాల ఫలితంగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఏర్పాటు జరిగిందని, దీనిని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేయాలని చూస్తే ఊరుకునేది లేదని అన్నారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పోలం కొండయ్య, ప్రధాన కార్యదర్శిగా కొక్కుల రాజేందర్‌లతోపాటు తొమ్మిది మందిని కమిటీగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కార్యదర్శి బండి నర్సయ్య, జిల్లా కోశాధికారి శ్యామల దేవేందర్, సీపీఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, జక్కుల ఐలయ్య, శ్యాంసుందర్, కొమురయ్య, సర్వేశ్వర్‌రావు, కంగల రామయ్య, అజయ్, దేవేందర్, మల్లమ్మ, కొయ్యడ లక్ష్మి, పద్మ, స్వరూప, దేవేందర్, మల్లు పాల్గొన్నారు.

## వెంకటేశ్‌ను తొలగించాలని రైతుల నిరసన

గోవిందరావుపేట, ఏప్రిల్ 16 : మండలంలోని చల్వాయి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద ఇన్‌చార్జిగా ఉన్న చీకుల్లా వెంకటేశ్‌ను తొలగించాలని గ్రామ రైతులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా వెంకటేశ్ కొనుగోలు కేంద్రానికి ఇన్‌చార్జీగా ఉంటూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆవేదన చెందారు. వెంకటేశ్‌ను తొలగించాలని గతంలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. కలెక్టర్ స్పందించి వెంకటేశ్‌ను వెంటనే తొలగించి మరొకరిని ఇన్‌చార్జిగా నియమించాలని రైతులు కోరారు. ఈ విషయంపై పీఏసీఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డిని వివరణ కోరగా వెంకటేశ్ ప్రవర్తనపై రైతులు తన దృష్టికి తీసుకువచ్చిన మాట నిజమేనని, వెంకటేశ్‌ను హెచ్చరించినట్లు ఎల్లారెడ్డి తెలిపారు.

## బాధిత కుటుంబానికి పుట్ట మధు పరామర్శ

కాటారం, ఏప్రిల్ 16 : మండలంలోని ధన్వాడ గ్రామంలో మాజీ ఎంపీటీసీ బోడ మమతానరేశ్ కుమారుడు సుహాన్ ఇటీవల మృతి చెందాడు. వారి కుటుంబాన్ని బుధవారం బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జక్కు రాకేశ్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, నాయకులు జక్కు శ్రావణ్, చీమల వంశీ, పంతకాని సదువలి, జక్కు మొగిళి తదితరులు ఉన్నారు.

## ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

**తన చావుకు ఇద్దరు కారణమంటూ ఫోన్ రికార్డింగ్**

తాడ్వాయి, ఏప్రిల్ 16 : మండలంలోని కాటాపురం గ్రామానికి చెందిన కంపెల్లి దేవేందర్(40) మంగళవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. గ్రామంలోని బెస్తగుంపునకు చెందిన దేవేందర్ బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 10న దేవేందర్ స్వగ్రామానికి వచ్చాడు. ఈనెల 15న గ్రామంలో జరిగే సర్కస్‌ను చూసేందుకు తోటి స్నేహితులతో వెళాడు. రాత్రి 1:30గంటల సమయంలో తనకు రూ.50 కావాలంటే తల్లి ఇచ్చింది. అరగంట తర్వాత వర్షం ప్రారంభం కావడంతో బాత్‌రూమ్ వద్ద ఉన్న సబ్బు ఇంట్లోకి తీసుకువచ్చేందుకు తల్లి కన్నమ్మ వెళ్లగా ఇంటి ఆవరణలో ఉన్న గుడిసెలో దేవేందర్ చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించింది. తల్లి రొదనలు విని చుట్టు పక్కల వారు వచ్చి కిందకు దించి చూడగా అప్పటికే దేవేందర్ మృతి చెందాడని తెలిపారు. దేవేందర్ చిన్న కుమారుడు వినయ్ సెల్‌ఫోన్ చెక్ చేయగా అందులో తన చావుకు రామెళ్ల ప్రశాంత్, రామెళ్ల నర్సలు కారణమని రికార్డింగ్ ఉందని తెలిపారు. తమ కుమారుడి చావుకు కారణమైన వారిద్దరిపై కేసు నమోదు చేయాలని తల్లి కన్నమ్మ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.


# కొత్త చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం

**కలెక్టర్లు రాహుల్ శర్మ, టీఎస్ దివాకర**

భూపాలపల్లి రూరల్/ములుగురూరల్, ఏప్రిల్ 16 : నూతనంగా అమల్లోకి తెచ్చిన భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం కానున్నాయని, విధివిధానాలను ప్రజలకు స్పష్టంగా వివరించాలని జయశంకర భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు రాహుల్‌శర్మ, టీఎస్ దివాకర తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం భూపాలపల్లి పట్టణంలోని ఐడీవోసీ కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో, ములుగు కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ, ఆర్డీవో వెంకటేశ్‌లతో కలిసి తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, గిర్దావర్లతో భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్లు పాల్గొని మాట్లాడారు. ఈ చట్టంపై రెవెన్యూ శాఖలో పని చేసే ప్రతి ఉద్యోగి స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో భూ భారతి హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చట్టంపై ప్రజల స్పందన సేకరించాలన్నారు. చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అక్రమాలకు పాల్పడితే సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు నమోదుతోపాటు శాఖా పరంగా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు వారు హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, అన్ని మండలాల తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, గిర్దావర్లు పాల్గొన్నారు.

### భూ భారతి అవగాహన సదస్సుల షెడ్యూల్..

ఈ నెల 17వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అన్ని మండలాల్లో జరుగనున్న భూ భారతి అవగాహన సదస్సుల షెడ్యూల్‌ను కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రకటించారు. 17వ తేదీ (గురువారం) నుంచి జిల్లాలోని 12 మండలాల్లో ఈ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17వ తేదీన గణపురం, 19వ తేదీన కాటారం, 21న భూపాలపల్లి, 22న చిట్యాల, 23న మహదేవపూర్, పలిమెల, 24న మహాముత్తారం, 25న రేగొండ, కొత్తపల్లిగోరి, 26న మల్హర్‌రావు, 28వ తేదీన మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల్లో భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

### భూ భారతి స్పెషల్ అధికారిగా కిరణ్ ప్రకాశ్..

ములుగు, ఏప్రిల్16 (నమస్తే తెలంగాణ) : భూ భారతి ప్రాజెక్టులో పైలట్ మండలంగా ఎంపిక చేసిన వెంకటాపూర్ మండలానికి స్పెషల్ అధికారిగా కరీంనగర్ డిప్యూటీ కలెక్టర్ ఎస్ కిరణ్ ప్రకాశ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ డాక్టర్ జ్యోతిబుద్ధ ప్రకాశ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులలో ఎదురయ్యే సమస్యలను, భూ భారతి పోర్టల్ అమలు తీరును ఆయన పర్యవేక్షించనున్నారు.

### ఏడాదిలోగా సమస్యల పరిష్కారం..



ములుగు, ఏప్రిల్16(నమస్తే తెలంగాణ) : భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం కానున్నాయని, ప్రభుత్వం అదనంగా భూ భారతి పోర్టల్‌లో 14అంశాలను చేర్చిందని ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. బుధవారం ములుగు కలెక్టరేట్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. భూ సమస్యలపై గతంలో కోర్టులను ఆశ్రయించే వారని, నేడు కోర్టును ఆశ్రయించకుండానే షెడ్యూల్(ఏ)ను ఏర్పాటు చేసి భూమి విలువ రూ.5లక్షల లోపు ఉంటే ఆర్డీవో స్థాయి, ఆపై ఉంటే కలెక్టర్ స్థాయి అధికారులు సమస్యలను పరిష్కరించడానికి అవకాశం కల్పించిందని అన్నారు. దరఖాస్తు చేసుకున్న వ్యక్తి ఆ రోజు నుంచి సంవత్సర కాలం లోపు సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. కలెక్టర్ స్థాయిలో సమస్య పరిష్కారం కాని పక్షంలో సీపీఎల్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం మండల తహసీల్దార్లు, సబ్‌రిజిస్టర్ అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నారని, ఇక నుంచి అన్ని పరిశీలించిన అనంతరమే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముగించనున్నట్లు తెలిపారు. జిల్లాలో వెంకటాపూర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని ఆ మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పరిశీలన చేసిన అనంతరం జూన్ 2వ తేదీన పట్టాలు అందజేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

## రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

గణపురం, ఏప్రిల్ 16 : ఎల్కతుర్తిలో ఈనెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చెల్పూర్, గొల్లపల్లి, లక్ష్మీరెడ్డిపల్లి, కర్కపల్లి, గాంధీనగర్, మైలారం గ్రామాల్లో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం బీఆర్ఎస్ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు మోతె కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా గండ్ర వెంకటరమణారెడ్డి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలసాని లక్ష్మీనరసింహారావు, స్పోర్ట్స్ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు నడిపెల్లి మధుసూదన్‌రావు, కేజీఆర్ యువసేన జిల్లా అధ్యక్షుడు వీసం భరత్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు పిన్నింటి మణిదీప్‌రావు, పిన్నింటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా, మండలంలోని లక్ష్మీరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఏదిల్లె మల్లారెడ్డిని లక్ష్మిరెడ్డిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మల్లారెడ్డికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

## వ్యాధి నిరోధక టీకాలపై సమీక్ష

ములుగురూరల్, ఏప్రిల్ 16 : ములుగు జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు, డబ్ల్యూహెచ్‌వో సర్వే లెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అతుల్, జిల్లా ఆరు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విపిన్‌కుమార్, వ్యాధి నిరోధక టీకాల ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రణధీర్ ఆధ్వర్యంలో వ్యాధి నిరోధక టీకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు జిల్లాలో చేపట్టే టీకాల షెడ్యూల్‌పై చర్చించారు. వైద్యులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆరోగ్యవంతమైన పిల్లలను తయారు చేసేందుకు పీహెచ్‌సీల్లో చిన్నారులకు టీకాలు అందేలా చూడాలన్నారు. అనంతరం ములుగులోని ఉపకేంద్రాన్ని సందర్శించి టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. వారి వెంట జిల్లా అసంక్రమిత వ్యాధుల ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పవన్‌కుమార్, డెమో సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సూర్ణసంపత్‌రావు, సూపర్‌వైజర్ దేవమ్మ, దేవేందర్, ఆరోగ్య కార్యకర్త పూల్‌బంద్, నర్సమ్మ, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

## ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేయాలి

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 16 : ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు విచారణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. బుధవారం ఐడీవోసీ కార్యాలయంలో గృహ నిర్మాణశాఖ, డీఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గంలోని 145 గ్రామపంచాయతీల పరిధిలో 33,089 దరఖాస్తులు, మంథని నియోజకవర్గ పరిధిలోని 84గ్రామ పంచాయతీల పరిధిలో 18,634 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో ఈ నెల 21వ తేదీ వరకు ప్రాథమిక విచారణ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్డీవో నరేశ్, గృహనిర్మాణ శాఖ పీడీ లోకిలాల్, భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, అన్ని మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## బియ్యం పంపిణీ సజావుగా జరిగేలా చూడాలి

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 16 : ప్రజాపాలన, గ్రామసభలలో స్వీకరించిన దరఖాస్తులను వెంటనే విచారణ చేసి అర్హత మేరకు మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ సూచించారు. బుధవారం తన ఛాంబర్‌లో రేషన్‌కార్డుల విచారణ, ఆన్‌లైన్ నమోదు, తదితర అంశాలపై తహసీల్దార్లతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల నుంచి ప్రారంభమైన సన్నబియ్యం పంపిణీ ఇప్పటివరకు 88.21శాతం పూర్తి అయ్యిందన్నారు. పంపిణీ తేదీని ఈ నెల 17వ తేదీ వరకు పెంచినట్లు తెలిపారు. మండల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు సమకూర్చాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

**10మందిపై కేసు నమోదు**

తాడ్వాయి, ఏప్రిల్ 16 : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కబేళాకు తరలిస్తున్న 69గోవులను పట్టుకుని 10మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారం మేరకు 163వ జాతీయ రహదారిపై ఎస్సై ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో వరంగల్ వైపునకు వెళ్తున్న 5బొలేరో వాహనాలను ఆపి తనిఖీ చేయగా వాటిలో సుమారు 69గోవులు ఉన్నట్లు గుర్తించారు. అనుమతి పత్రాలు అడుగగా వారు చూపించకపోవడంతో గోవులను, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గోవులను తరలిస్తున్న 10మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. భద్రాచలం, చర్ల ప్రాంతంలో గోవులను కొనుగోలు చేసి అనుమతులు లేకుండా హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలిపారు.

## మృతుల కుటుంబాలకు గండ్ర పరామర్శ

చిట్యాల, ఏప్రిల్ 16 : మండలంలోని నైన్‌పాక గ్రామానికి చెందిన కంచర్ల పెద్దమల్లయ్య, నల్లబెల్లి మల్లక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, మాజీ ఎంపీటీసీ యాదండ్ల గట్టయ్య, బీఆర్ఎస్ నాయకులు మండ గోపి, వావిల్ల బాలరాజు, శ్రీపతి రఘురాం, తొట్ల రవి, సందాన్, సావటి రవి, చెలుపూరి సాంబయ్య, యూత్ అధ్యక్షుడు గుండు నగేశ్ ఉన్నారు.

**మంగపేటలో కాకులమర్రి..**

మంగపేట, ఏప్రిల్ 16 : మండలంలోని చెరుపల్లి(కొత్తపేట)కు చెందిన మాజీ సర్పంచ్ జనగాం రామచందర్‌రావు తల్లి అనసూయాదేవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని బుధవారం బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు తాటి కృష్ణ, కాకులమర్రి ప్రదీప్‌రావు, మల్లూరు దేవస్థాన మాజీ చైర్మన్ నూతిలకంటి ముకుందం, చిట్టిమల్ల సమ్మయ్య, చిలకమర్రి రాజేందర్, మలికంటి శంకర్, పూజారి శ్రీనివాస్, కొమరం రామ్మూర్తి, నర్సింహులు, ఖాజాపాషా, రఘు, కృష్ణప్రసాద్, పోషయ్య, ముత్తయ్య, కర్రీ శ్రీను, కర్రీ రామ్మోహన్, సోషల్ మీడియా ఇన్‌చార్జి గుడివాడ శ్రీహరి పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు?

కాటారం, ఏప్రిల్ 16 : మండలంలోని ఆదివారంపేటలో వృద్ధురాలు మల్లుబాయిని గొడ్డలితో దాడిచేసి దారుణంగా హత్య చేసిన ఘటనలో నిందితుడు పోలీసులకు పట్టుబడ్డట్లు తెలుస్తోంది. హత్య జరిగిన నాటి నుంచి క్లూస్, ఇతర ఆధారాలతో డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఐ రాంచందర్‌రావు, మహాముత్తారం, కాటారం ఎస్సైలు మహేందర్‌యాదవ్, అభినవ్, శ్రీనివాస్ ఆధ్వర్యం లో పోలీసులు పలు బృందాలుగా ముమ్మర గాలింపు చర్యలు చేపట్టా రు. నిందితుడు పలు జిల్లాల్లో తిరుగుతూ ఆంధ్రప్రాంతానికి వెళ్లగా మంగళవారం తెల్లవారు జామున పోలీసులకు చిక్కినట్లు సమాచా రం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన నిందితుడు శనివారం ఆదివారంపేటలో రెక్కీ నిర్వహించి వృద్ధురాలిని హత్య చేసినట్లు తెలుస్తోంది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

PLOT FOR SALE
★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565